క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



రాయపర్తి : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై విజయ్‌కుమార్ శనివారం విధుల్లో చేరారు. హసన్‌పర్తి నుంచి బదిలీపై వచ్చిన విజయ్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులు ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌ఈడీ బల్బుల బహూకరణ



పర్వతగిరి : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయానికి కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు ఎల్‌ఈడీ బల్బులను బహూకరించారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్ శనివారం ఎస్‌ఓకు అందించారు.

ఎమ్మెల్యే ‘పెద్ది’కి సన్మానం



నర్సంపేట : నర్సంపేట పట్టణానికి మెడికల్ కళాశాల మంజూరు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కస్తూర్బా మహిళా మండలి కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు.

ఉద్యమకారుల రాస్తారోకో




గీసుకొండ: ఉద్యమకారుల ఆధ్వర్యంలో మండలంలోని ధర్మారం అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమ కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మారెడ్డి అనుచరుడు చింతం సదానందం ఉద్యమ నాయకులు సందెల సునీల్, గజ్జి విష్ణును బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఏ హోదాలో ప్రకటించారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరకాల మండలంలోని ఓ గ్రామంలో కాంగ్రెస్, టీడీపీ నుంచి వచ్చిన 15 మందికి దళితబంధు ఇచ్చినందుకా, ఉద్యమ నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్‌రావుకు టికెట్ కేటాయించాలని అడిగినందుకా నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే ధర్మారెడ్డి స్వయంగా వివరణ ఇవ్వాలని, సస్పెండ్ చేసిన సునీల్, విష్ణును తిరిగి పార్టీలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డ్రైవర్ కాదు.. సర్పంచ్



నెక్కొండ : మండలంలోని పెద్దకోర్పోలు సర్పంచ్ మహ్మద్ మైబూబ్‌పాష డ్రైవర్ అవతారం ఎత్తాడు. జీపీ కార్మికుల సమ్మె మొదలైనప్పటి నుంచి గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడి చెత్తా, చెదారం అక్కడే తిష్ట వేయడం సర్పంచ్ గమనించి, ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉండడంతో శనివారం పారిశుద్ధ్య పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా ఇంటింటి చెత్తా సేకరణకు వెళ్లగా.. ప్రతి ఒక్కరూ చెత్తా, చెదారంను ట్రాక్టర్ వేశారని మైబూబ్‌పాష తెలిపారు. ఇందుకు గ్రామస్తులు సైతం సహకరించారని ఆయన పేర్కొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



దుగ్గొండి : మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం బాలిరెడ్డి ఉచితంగా అందించేందుకు నోట్‌బుక్స్‌లు, స్టేషనరీ సమకూర్చారు. కాగా శనివారం నోట్‌బుక్స్‌లను హెచ్‌ఎం రామ్మూర్తి విద్యార్థులకు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సాయం చేయడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయురాలు నిర్మల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు..

వర్ధన్నపేట : గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం గోశాల ఫెడరేషన్ సభ్యులు వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ నర్సింహస్వామి, సిబ్బందితో పాటు సభ్యులు యాకూబ్, దేవేందర్, గణేష్, సుధాకర్, కిరణ్, రవీందర్ పాల్గొన్నారు.

వేలాడుతున్న మృత్యుపాశాలు

- రైతులకు పొంచి ఉన్న ప్రమాదం
- పనికి వెళ్లాలంటే వణుకుతున్న కూలీలు
- ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా!



ఆశాలపల్లిలో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

సంగెం : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. మండలంలోని ఆశాలపల్లిలో కరెంట్ తీగలు తలకు తగిలే ఎత్తులో కిందికి వేలాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆశాలపల్లి గ్రామంలోని ఎస్‌ఎస్–8 పరిధిలోని పంట పొలాల్లో ఒకే స్తంభాలకు పైన 11 కేవీ విద్యుత్ తీగలు, కింద ఎల్‌టీ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. ఎల్‌టీ విద్యుత్ తీగలు తలకు తగిలే ఎత్తులో వేలాడుతుండడం వల్ల రోజు పంటపొలాలకు వెళ్లే రైతులు, పంట చేలల్లో కలుపు తీసేందుకు వెళ్లే కూలీలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో వణుకుతున్నారు. విద్యుత్ అధికారుల తీరుపై రైతులు, రైతు కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు. వేలాడే విద్యుత్ తీగల కింద ఉన్న పంట పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కి దున్నాలన్నా ట్రాక్టర్ ఇంజన్ టాప్ తగులుతోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా విద్యుత్ తీగలను సరి చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా నాలుగు రోజులు ఆగితే పొలంలో బురద దున్ని నాటు వేసుకోవాల్సి ఉంటుందని ఇనుప గొర్రులు భుజాలపై మోసుకుని వెళ్లలేని దుస్థితి నెలకొని ఉందని రైతులు చెబుతున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని పలువురు రైతులు, రైతు కూలీలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని అనేక సార్లు విద్యుత్ కార్యాలయానికి వెళ్లి చెప్పినా అధికారులు స్పందించడం లేదు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా.. ఆ తర్వాత పట్టించుకుంటే పోయినా ప్రాణాలు తెచ్చిస్తారా.. జర అధికారులు పట్టించుకోని వేలాడుతున్న తీగలను సరిచేయాలి.

- బోనాల రాజు, రైతు, ఆశాలపల్లి

స్తంభాలు రాగానే సరిచేస్తాం..

విద్యుత్ స్తంభాల కొరత ఉంది. వేసవిలో వ్యవసాయ బావులు, పంట చేలల్లో వేలాడే తీగలను సరిచేయడానికి మిడిల్ పోల్స్ పలు గ్రామాల్లో వేశాం. ఆశాలపల్లి ఎస్‌ఎస్–8 పరిధిలో లూజ్ లైను సరిచేయడానికి మూడు స్తంభాలు అవసరం ఉన్నాయి. విద్యుత్ స్తంభాలు రాగానే వెంటనే సరిచేస్తాం.

- తిరుపతిరెడ్డి, ఏఈ కాపులకనిపర్తి

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సంగెం : బీఆర్‌ఎస్ పార్టీ కోసం పనిచేసే ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన చెవ్వ బాలకృష్ణ, గీసుకొండ మండలంలోని ఊకల్ సొసైటీ డైరెక్టర్ చెవ్వ పాపయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంద్రకోటి రవి, రమ, చెవ్వ సారమ్మ, కోమలతో పాటు పలువురికి హనుమకొండలోని తన నివాసంలో కండువాలు కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపు నిచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, కొనకటి మొగిలి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి గణేష్

నర్సంపేట : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలను పట్టణ అధ్యక్షుడు కొయ్యల మోహన్ అధ్యక్షతన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేయడం వల్ల దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్న ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు కనీస మౌళిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ప్రభు, కిరణ్, సురేష్, సూర్య, ఆకాష్, అశ్విని, మమత, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఇచ్చింది కాంగ్రెసే..

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న మాధవరెడ్డి

చెన్నారావుపేట : రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇచ్చింది, ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు.ఈ మేరకు మండలంలోని జోజిపేట నారాయణ తండా గ్రామ పంచాయతీలో శుక్రవారం రాత్రి హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలకులు ఎన్నికల్లో గెలిస్తే గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని దొంగ హామీ ఇచ్చి గెలిచిన తర్వాత మోహం చాటేసుకున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.185లకే 9 రకాల వస్తువులు రేషన్ ద్వారా అందించిందన్నారు. ఆ పథకాన్ని తుంగలో తొక్కారని అన్నారు. ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ చేతి గుర్తుకు ఓటు వేసి రుణం తీర్చుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్, రూ. 2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ. 15,000, ఇళ్లు నిర్మించుకునే వారికి రూ. 5 లక్షలుతో పాటు నిరుద్యోగ భృతి, ఆరోగ్య శ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్యం పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తామన్నారు. పాలాయి శ్రీనివాస్, జగన్‌మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు భూక్యా గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, భాస్కర్, వేముల సాంబయ్య, రమేష్‌యాదవ్, మంచాల సదయ్య, సిద్దన రమేష్, తప్పెట రమేష్, తూటి పావని, ఇంద్రసేనారెడ్డి, అమిరొద్దీన్, ఆరోగ్యం, వీరన్న నాయక్, సురేష్, అంబాల రవి, వెంకన్న, తదితరులు ఉన్నారు.

మెగా హెల్త్ క్యాంపు

సంగెం : మండలంలోని ఆశాలపల్లిలో లయన్స్ కృషి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. వరంగల్ ఆయుర్వేదిక్ ఆస్పత్రి, శరత్ కంటి ఆస్పత్రి వైద్యులు 350మంది రోగులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిశోర్‌యాదవ్, ఆయుర్వేదిక్ ఆస్పత్రి సూపరింటెండెంట్ జగన్‌మోహనాచారి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, చంద్రశేఖర్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

దుగ్గొండి : 1–19 సంవత్సరాల లోపు చిన్నారులంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపీపీ కాట్ల కోమల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల వారిగా 19 ఏళ్ల లోపు వారి వివరాలు సేకరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఈనెల 20న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, వైద్యాధికారి కిరణ్‌రాజు, హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వంటావార్పుతో జీపీ కార్మికుల నిరసన



చెన్నారావుపేట: వంటావార్పు చేస్తున్న కార్మికులు



ఖానాపురంలో..



నర్సంపేట రూరల్‌లో..



నెక్కొండ: అంబేద్కర్ సెంటర్‌లో వంటావార్పు చేస్తున్న జీపీ కార్మికులు

నర్సంపేట రూరల్ : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీపీ కార్మికుల జేఏసీ జిల్లా నాయకులు శ్రీనివాస్ అన్నారు. నర్సంపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న జీపీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి పదో రోజుకు చేరుకున్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల అధ్యక్షుడు పున్నం ఆనంద్, ఉపాధ్యక్షుడు మహేందర్, కోశాధికారి నర్ర కృష్ణ, ఎండీ యాకుబ్, శ్రీనివాస్, కోటి నర్సయ్య, సాంబయ్య, శ్రీశైలం, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో..

నెక్కొండ : తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్లేందుకు జీపీ కార్మికులు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం వంటవార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 10వ రోజుకు చేరాయి. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ (టీఎస్ఎస్ డబ్ల్యూజేఎల్‌ఏ) జిల్లా కన్వీనర్ ఈదునూరి మహేష్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కో కన్వీనర్ అలువాల సైదులు, సభ్యులు బానోత్ రాము, సిగం అరుణ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్యా నరేష్, కార్మికులు శ్రీనివాస్, పాష, వెంకటేశ్వర్లు, మదార్, శివరాజు, నాగమ్మ, హైమ, వెంకటనర్సమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శనివారం వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూడయ్య, సురేష్, పాషా, ఉపేందర్, రాజు, అశోక్, సురేందర్, సాంబయ్య, తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నల్లబెల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సాధనపెల్లి ధర్మేందర్ అన్నారు. సమ్మెలో ఎండీ యాకుబ్ పాషా, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు రవి, తరుణ్, చక్రపాణి, బ్రహ్మయ్య, రవి, కుమారస్వామి, సాంబయ్య, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులపై నిర్లక్ష్యం సరికాదు

ఖానాపురం : గ్రామ పంచాయతీ కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని మండల జీపీ కార్మిక జేఏసీ అధ్యక్షుడు కాసు యాకయ్య అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటలు ఆడి వంటావార్పు చేపట్టారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములమైనప్పటికి జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, వీరన్న, ఉస్మాన్, బిక్షపతి, హరి, యాకుబ్, రవీందర్, వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తిలో..

రాయపర్తి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై జీపీ కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్, గారె ఉపేందర్, శ్రీను, మహాత్మా, రత్నాకర్, సంపత్, పద్మ, రాములు, ఎల్లయ్య, బాబు, రాజు, అఖిల్, రమ, బాలాజీ, మహేందర్, నరహరి, యాకయ్య, మల్లయ్య, వీరస్వామి, ఐత కోమల, నర్సమ్మ, జ్యోతి, యాకాంతం, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ: జీపీ సిబ్బంది సమ్మెకు సంఘీభావం తెలియజేస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు శనివారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో గాదం రాజాలు, పొన్నం రమేష్, ముస్కు రాజు, పుట్టపాక రాజేందర్, క్రిష్ణమూర్తి, స్వామి, రమణాచారి, గంగాడి అశోక్‌రెడ్డి, బిక్షపతి, సదయ్య పాల్గొన్నారు.

కార్మికులకు విజయ్‌చందర్‌రెడ్డి సంఘీభావం

గీసుకొండ : సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు బీజేపీ పరకాల ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి శనివారం సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాన్ విక్రమ్, అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొంగర రవి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకన్న, ప్రవీణ్, అఖిల్ పాల్గొన్నారు.



నల్లబెల్లిలో..



దుగ్గొండిలో..



రాయపర్తిలో..

సంక్షిప్త సమాచారం

ఉపాధ్యాయుల ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోపు సాత్విక బాసరలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. కాగా శనివారం సాత్వికను ప్రధానోధ్యాయుడు, ఉపాధ్యాయులు అందించి, రూ.10వేలు ఆర్థికసాయం చేసి అభినందించారు.

పేద విద్యార్థులకు..

నర్సంపేట : పట్టణంలోని రెడ్డి కుల సంఘం కార్యాలయ వేదికలో పరపతి రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎర్ర యాకుబ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంది గోపాల్ రెడ్డి పది మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

అభినందన

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థి కాసాని గణేష్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం జన్నపురెడ్డి ఉమారాణి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం గణేష్‌ను సన్మానించారు. అనంతరం ఆర్మీ మాజీ జవాన్ చింతకింది శివకృష్ణ, తెలుగు ఉపాధ్యాయురాలు వేముల మమత, నగదు పారితోషికం అందించి ఉన్నత స్థానాలలో నిలవాలని ఆశీర్వదించారు.

వరుణ్‌కు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు

నర్సంపేట : ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల్లో నర్సంపేట సిద్ధార్థ డిగ్రీ కళాశాల బీజేడ్సీ చదివిన వంగలపూడి వరుణ్ వృక్షశాస్త్రం విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి శనివారం వరుణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.పరమేశ్వర్, విద్యార్థి తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్షరద స్కూల్‌లో బోనాల జాతర

నర్సంపేట : నర్సంపేటలోని అక్షర ద స్కూల్, బిట్స్ స్కూల్‌లో శనివారం బోనాల జాతర సంబురాలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఇంటి వద్ద బోనాలు తయారు చేసుకొని వచ్చారు. విద్యార్థులు పోతరాజు వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి బోనాల జాతర పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

జయముఖిలో విద్యార్థులకు వీడ్కోలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్ధుంపురం జయముఖి ఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శనివారం ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. యాజమాన్యం శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వాసుదేవమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి

పర్వతగిరి : విద్యార్థుల ప్రవర్తనను ఇంటి వద్ద తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు సూచించారు. ఈ మేరకు పర్వతగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో పేరెంట్స్, టీచర్ సమావేశం ప్రధానోపాధ్యాయుడు ఎండి.జలీల్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

ఎంపీపీని సస్పెండ్ చేయాలి

చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్న ఎంపీపీ విజేందర్, తొగరు చెన్నారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్న ఇరువురిని జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సస్పెండ్ చేయాలని ఆయన కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభ కరపత్రాలను మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి శనివారం ఆవిష్కరించారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

చెన్నారావుపేట : సొంత భూమిలో మట్టి పోసుకున్న తనపై పోలీసులు దౌర్జన్యం చేశారని మండల కేంద్రానికి చెందిన వరంగంటి కుమారస్వామి నర్సంపేట ఏసీపీకి శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఏసీపీ స్పందించి నెక్కొండ సీఐని బుధవారం కలిసి సమస్యను వివరించాలని తెలిపినట్లు వివరించారు. పోలీసులు భూమి విషయంలో జోక్యం చేసుకోవడం సరికాదన్నారు.

ప్లీనరీకి తరలిన బీసీ నాయకులు

నర్సంపేట : హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీల రాజకీయ ప్లీనరీకి నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల నుంచి బీసీ నాయకులు శనివారం తరలి వెళ్లారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలో ప్లీనరీకి తరలిన వాహనాలను బీసీ సంఘం నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. పెండెం భాస్కర్, శీరంశెట్టి రాజేందర్, ఒడపల్లి రమేష్, మద్దెల కొమురయ్య, గూబ రాజు, సతేంద్ర సంధ్య, అంకం జ్యోతి, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని ఎంపీపీ బానోత్ సారంగపాణి సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నియామకం

వర్ధన్నపేట : వర్ధన్నపేట మండల కో ఆప్షన్ సభ్యుడిగా సయ్యద్ సోఫీ ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, వ్యవసాయశాఖాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఇల్లంద గ్రామానికి చెందిన బాషావియా కో ఆప్టెడ్ సభ్యుడిగా ఉండగా మామునూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఖాళీ ఏర్పడింది. దీంతో శనివారం నామినేషన్ స్వీకరించారు. ఎంపీపీ అప్పారావు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో దాడులు ఆపాలి : బీజేపీ

నర్సంపేట : దళిత కాలనీల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులను ఆపాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నల్లబెల్లి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం నిరసన తెలిపి విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో టెక్నికల్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణంలోని వివిధ దళిత కాలనీల్లో విద్యుత్ అధికారులు దాడులు చేస్తున్నారని తెలిపారు. దళితుల ఇళ్లకు కరెంటు సరఫరా నిలిపివేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దళితులకు ముఖ్యమంత్రి పదవి, మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు వంటి మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ దళితబంధు పేరుతో మరో మోసానికి తెరలేపారన్నారు. దళితులపై విద్యుత్ అధికారులు పెట్టిన కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.